వివాహితను వేధించిన ఘటనలో | 'ఎర్ర' టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐపై కేసు

తిరుపతి(నేరవిభాగం), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఓ మహిళను వేధించిన ఘటనలో రెడ్ శాండల్ రిజర్వ్ ఎస్ఐ విశ్వనాథ్‌పై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్ కథనం మేరకు.. రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్‌లో రిజర్వు ఎస్ఐగా విశ్వనాథ్ పనిచేస్తున్నాడు. అతడి స్నేహితుడి చెల్లెలి వెంట పడుతూ రెండు సంవత్సరాలుగా వేధిస్తున్నాడు. ఈ విషయం తెలిసి ఆమె భర్త అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుమలలో ఏరియా డామినేషన్ కార్యక్రమంలో తనిఖీలు

హై అలర్ట్



షార్ మొదటి గేటు వద్ద..

రేణిగుంట విమానాశ్రయం వద్ద..

దేశ సరిహద్దులో.. పాక్‌తో ఉద్రిక్తత నేపథ్యంలో జిల్లాలో భద్రత పెంచారు. తిరుమలలో భద్రతా బలగాలు శుక్రవారం సాయంత్రం ఏరియా డామినేషన్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టాయి. ఇక, రేణిగుంట విమానాశ్రయం, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను హై అలర్ట్ జోన్ కిందకు తీసుకొచ్చి భద్రత పెంచారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



డాక్టర్ డీఎం ప్రేమావతి (ఫైల్ ఫొటో)

సాహితీవేత్త ప్రేమావతి కన్నుమూత

- పద్మావతి డిగ్రీ కాలేజీ తొలితరం తెలుగు అధ్యాపకురాలిగా విశేష కృషి
- పలువురి సంతాపం, నేడు అంత్యక్రియలు

సాహిత్యవేత్త, పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం అధ్యాపకురాలు డీఎం ప్రేమావతి(83) కన్నుమూశారు. సోమవారం ఉదయం అస్వస్థతకు గురైన ఆమె స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆఖరి శ్వాస విడిచారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం నంగమంగళం ఈమె పుట్టిన ఊరు. ఆడపిల్లలకు చదువెందుకు అనే రోజుల్లో ఊరుదాటి విద్యాభ్యాసం చేశారు. దాశరధి రంగాచార్య నవలలపై పీహెచ్‌డీ చేసిన ప్రేమావతి 1965లో పద్మావతి కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా చేరారు. 2000లో రీడర్‌గా రిటైరయ్యారు. ఈమె గురువు పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి 104 ఏళ్ల వయసులో ఇటీవలే మరణించారు. ప్రేమావతి రాసిన ఆచార్య జీఎన్ రెడ్డి జీవిత చరిత్రను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. పద్మావతి కళాశాలలోనే చదువుకుని, అక్కడే బోధన చేసి రిటైరైన ప్రేమావతి తన అనుభవాలను 'నేనూ- నా కళాశాల' పేరుతో ఒక పుస్తకాన్ని రాశారు. సాహిత్య సభల్లో ఆమె ఉపన్యాసాలు విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రేమావతి మరణంతో ఆమె శిష్యులు, సాహిత్యకారులు, విద్యావేత్తలు విషాదంలో మునిగిపోయారు. బైరాగిపట్టెడ పార్క్ సమీపంలోని ఆమె స్వగ్రహం వద్ద అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ఉంచారు. శనివారం ఉదయం 10 గంటలకు గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

తోటి వేషం వేసి.. గంగమ్మను దర్శించి

పిల్లలు ఒళ్లంతా బొగ్గుపొడి పూసుకున్నారు. తెల్లనామం సాది కనుబొమ్మలపైన చుక్కబొట్లు పెట్టుకున్నారు. నడుంచుట్టూ, తలకు వేపాకు మండలను కట్టుకున్నారు. ఇలా శుక్రవారం తిరుపతి గంగజాతరలో తోటి వేషధారణతో అమ్మవారిని మొక్కుకున్నారు. పలువురు చిత్ర విచిత్ర వేషాలు ధరించారు. ఇక, సాయంత్రం 4 గంటల నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఇక, వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు శనివారం సాయంత్రం టీటీడీ తరపున సారె అందించనున్నారు. అలాగే, శనివారం దొర వేషాన్ని కైకాల, చాకలి కులస్థులు అనువంశికంగా వేస్తారు. ఈ వేషాన్ని ఇతరులెవరూ వేయరు. తక్కిన భక్తులు పలు రకాల వేషాలతో అమ్మవారిని దర్శించుకుంటారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







ఆర్మీకి విరాళాలివ్వండి

- సైబర్ నేరగాళ్ల మెసేజీలు
- నమ్మి మోసపోవద్దంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు 'ఆపరేషన్ సిందూర్'నూ వదల్లేదు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితులను సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. తాము ఆర్మీ అధికారులమని, ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ పలువురికి మెసేజీలు పంపుతున్నారు. వీటిని ఎవరూ నమ్మొద్దని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ తరహా సైబర్ మోసాల గురించి తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు విరాళాలు అడగరని, ఎవరూ ఇలాంటి లింకులు టచ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఏపీకె ఫైల్స్'ను ఓపెన్ చేయొద్దన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోను కాల్స్. మెసేజీలు వస్తే స్పందించవద్దని హితవు పలికారు. యూపీఐ చెల్లింపులు చేయొద్దన్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరగాళ్లు దోచేస్తారన్నారు. ఇలాంటి వాటిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంజనీరింగ్ ఎక్సలెన్స్ కోసం

కియా, ఐఐటీ వ్యూహాత్మక ఒప్పందం

ఏర్పేడు, మే 9(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, సాంకేతిక ఆవిష్కరణలను నడిపించడానికి వ్యూహాత్మక అవగాహన ఒప్పందంపై కార్ల తయారీ సంస్థ అయిన కియా ఇండియా, తిరుపతి ఐఐటీ శుక్రవారం సంతకం చేశాయి. ఇంజనీరింగ్ ఎక్సలెన్సును, పరిశోధన నేతృత్వంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా ఈ ఎంవోయూ కుదిరింది. తిరుపతి ఐఐటీలో మౌలిక సదుపాయాలు, సహకార పరిశోధన కార్యక్రమాల అభివృద్ధికి కియా ఇండియా ఐదేళ్లకు రూ.35కోట్ల పెట్టుబడిని పెట్టింది. కియా ఇండియాలో వృత్తిపరమైన వృద్ధికి విద్యార్థులకు అర్థవంతమైన అవకాశాలను అందించడం వంటివి ఉన్నాయని అధికారులు తెలిపారు. అర్హులైన ఎంటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆర్థిక సాయం అందించనున్నట్లు ఐఐటీ అధికారులు తెలిపారు. తిరుపతి ఐఐటీలో మేకర్స్ క్రాస్- డిసిప్లినరీ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి లేబోరేటరిని సృష్టించడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశమన్నారు. ఐఐటీతో చేతులు కలపడం స్థిరమైన పారిశ్రామిక తయారీలో పురోగతికి మంచి అవకాశమని కియా ఇండియా ఎండీ, సీఈవో గ్వాంగు లీ అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థ, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం, ఇంటర్న్‌షిప్‌లు, స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రతిభను వెలికి తీయడానికి ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్మంలో వైస్ ప్రెసిడెంట్, హెచ్ఆర్ అండ్ అడ్మిన్ గ్రూప్ 2 హెడ్ జూంగ్వాన్ సియో, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్ డాంగ్‌లీ, ప్రొఫెసర్ శశిధర్ గుమ్మా, డీన్ వెంకటరమణ బదర్లా, డాక్టర్ వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న అధికారులు

పంచాయతీల వర్గీకరణకు కసరత్తు

- 16న ప్రభుత్వానికి నివేదిక

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల వర్గీకరణకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలను నాలుగు విభాగాలు విభజించి.. గ్రేడ్‌ను బట్టి అర్హులైన వారిని కార్యదర్శులను నియమించాలని జీవోలో పేర్కొంది. ఆ ప్రకారం జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి 16వ తేదిలోపు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ సూచించారు. దీంతో పంచాయతీల వర్గీకరణకు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం రాత్రి కమిటీని నియ మించి కసరత్తు ప్రారంభించారు. కేటగిరీల వారీగా పంచాయతీలను విభజించి 13వ తేదీ లోపల ప్రతిపాదనలను పంపించాలని డీపీవో సుశీలాదేవిని ఆదేశించారు.

స్పెషల్ గ్రేడ్: వార్షికాదాయం రూ.కోటి మించినా లేదా పది వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు ఈ విభాగంలో ఉంటాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీర్డీ) స్థాయి అధికారులను పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తారు. జిల్లాలో స్పెషల్ గ్రేడ్ కింద 14 పంచాయతీలు చేరనున్నాయి.

గ్రేడ్-1: నాలుగు వేల నుంచి 10 వేల జనాభా లేదా వార్షికాదాయం రూ.50లక్షల నుంచి రూ.కోటి ఉన్నా.. లేదా ఆ పంచాయతీకి హెడ్‌క్వార్టరుగా మండల కేంద్రం ఉంటే గ్రేడ్-1గా పరిగణిస్తారు. దీని పరిధిలో సుమారు 60 పంచాయతీలు రానున్నాయి.

గ్రేడ్-2: ఇందులో 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉండే పంచాయతీలు చేరనున్నాయి. ఇలాంటివి 141 పంచాయతీలు ఉన్నాయి.

గ్రేడ్-3: జనాభా రెండు వేలలోపు ఉండే పంచాయతీలన్నీ గ్రేడ్-3 కింద పరిగణిస్తారు. జిల్లాలో 572 పంచాయతీలు దీని కింద రానున్నాయి. స్పెషల్ మినహాయించి మిగతా పంచాయతీలకు నిబంధనల ప్రకారం కార్యదర్శులను నియమించనున్నారు. గిరిజన పంచాయతీలకు షరతులు వర్తించకుండా ప్రామాణికంగా తీసుకోనున్నారు.

జిల్లాకు 15మంది పంచాయతీ కార్యదర్శుల రాక

రాష్ట్రంలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి గ్రేడ్-2గా పదోన్నతి కల్పించి వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా రాయలసీమ జిల్లాల్లో పదోన్నతి పొందిన వారిలో 15 మందిని జిల్లాకు కేటాయించారు. వీరిలో.. చిత్తూరు నుంచి లోకముని, కడప నుంచి కె.సుధీర్, సుధాకర్, సురేష్‌కుమార్, సుబ్బరాయుడు, కర్నూలు నుంచి ఎలిజిబెతమ్మ, గిరిధర్, గులాం జమిలాబీ, వెంకట్రాముడు, కోట మునెయ్య, కృష్ణ, అయ్యపురెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.కుమార్, అనంతపురం నుంచి సురేష్‌బాబు ఉన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రెండు మూడురోజుల్లో వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు డీపీవో సుశీలాదేవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నివాళి



వెళ్లిపోయిన ప్రేమమూర్తి

పద్మావతి కళాశాల తొలితరం అధ్యాపకురాలు ప్రేమావతి మృతితో శోక సంద్రంలో స్నేహాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఒక తరం సాహిత్యవేత్త వెళ్లిపోయారు. పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం విద్యార్థి, అధ్యాపకురాలు కూడా అయిన డాక్టర్ డీఎం. ప్రేమావతి మరణం ఆమె శిష్యులనూ, సాహిత్యకారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. గుడిపాల మండలం నంగమంగళంలో 1942లో పుట్టిన ప్రేమావతి ఊరుదాటి చదువుకోవడమే ఆ కాలపు విచిత్రం. వీరికి తాతయ్యే కేఎం.రెడ్డి ఇందుకు కారణం. పై స్కూల్ ఫైనల్ తర్వాత చదువులకు తండ్రి అంగీకరించకపోవడంతో తల్లి నగలు దొంగలించి, ఆ డబ్బులతో రవీంద్రనాథ్‌టాగూర్ శాంతినికేతన్‌లో చేరారు. ఆ తర్వాత స్వంత ఊరికి తిరిగి వచ్చి బొమ్మసముద్రంలో పాక వేసి 1948లో బడి తెరిచారు. ఊరూరికీ తిరిగి పిల్లల్ని చేర్పించారు. ముఖ్యంగా ఆడపిల్లల చదువుల మీద ఆయన పెట్టిన శ్రద్ధతో ఆరేళ్ల ప్రేమావతి కూడా 1948లో బొమ్మసముద్రం బడిలో చేరారు. స్కూల్ ఫైనల్ తప్పితే పెళ్లి చేసేస్తామని ఇంట్లో బెదిరించడంతో ఆమె చదువే జీవితంగా గడిపారు. 1952లో తిరుపతిలో ప్రారంభమైన పద్మావతి కళాశాలలో 1958లో పదహారేళ్ల ప్రేమావతి పీయూసీ విద్యార్థిగా చేరారు. ఆ తొలి మెట్టే ఆమె అంతిమ లక్ష్యంగా మారింది. పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తికి ప్రియశిష్యురాలిగా మారారు. డిగ్రీ పూర్తి అయ్యాక ఆచార్య జీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో ఎస్వీయూలో పీజీ చేశారు. ఆయన పర్యవేక్షణలోనే దాశరథి రంగాచార్య నవలల మీద పీహెచ్‌డీ చేశారు. రాజేశ్వరీ మూర్తి పట్టుదల వల్ల 1965లో తనకు విద్యాభిక్ష పెట్టిన పద్మావతి కళాశాలలోనే అధ్యాపకురాలిగా చేరారు. వందలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశారు. ఆడవాళ్లకు చదువు అవసరం గురించి పదేపదే చెప్పేవారు. స్వతంత్రంగా జీవించమని అనేవారు. ఆమె శిష్యులు పలువురు వివిధ హోదాల్లో ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉన్నారు.

ప్రేమకు ప్రతిరూపం

ప్రేమావతి మరణంతో ఆమె స్నేహమాధుర్యాన్ని చవిచూసినవారంతా శోకతప్తులయ్యారు. ఆమె క్రమశిక్షణాయుతమైన జీవనశైలిని గుర్తు చేసుకుంటున్నారు. ఎప్పుడూ నలగని చీర, తలలో మల్లెపూలతోనే ఆమె కనిపించేవారు. 'మనుషుల పట్ల ఆమె ప్రేమాభిమానాలకు కొలతల్లేవు. ఆత్మవిశ్వాసానికీ, ఆత్మాభిమానానికీ ఆమె నిలువెత్తు సాక్ష్యంగా జీవించారు' అని ప్రసిద్ధ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కృష్ణప్రశాంతి గుర్తు చేసుకున్నారు. 'ప్రేమకు ప్రతిరూపం ప్రేమావతి. తన మిత్రులు ఎవరు అనారోగ్యానికి గురైనా తల్లడిల్లిపోయేవారు. ఆమె లోటు స్నేహాభిమానాలు అందుకున్నవారికి ఎన్నటికీ తీరనిది' అని ప్రముఖ చిత్రకారిణి కిరణ్‌కుమారి వ్యాఖ్యానించారు. 'ఆమె ఉత్తమ అధ్యాపకురాలు, భాషా, సాహితీ సేవకురాలు. విద్యారంగానికి మేలుబంతి' అని సాకం నాగరాజ అన్నారు. ' వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రేమావతి మరణం పెద్ద లోటు' అని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్ అన్నారు. గార్లపాటి దామోదర నాయుడు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, రాఘవ, మల్లారపు నాగార్జున, ఓ.వెంకటరమణ, కష్టవేణిశైలకుమార్, తోట వెంకటేశ్వర్లు, యువశ్రీ మురళి వంటి ఎందరో సంతాపం తెలిపారు. పద్మావతి కాలేజీలో సంతాప సభ నిర్వహించారు. పద్మావతి కాలేజీకి ప్రేమావతి అందించిన సేవలను పద్మావతి జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు భువనేశ్వరీదేవి, నారాయణమ్మ కొనియాడారు.

సాహిత్యవేత్తల సాన్నిహిత్యం : ప్రముఖ సాహిత్యవేత్తలు కెవి రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వకుళభరణం రామకృష్ణ, లలిత, ఆచంట శారదాదేవి, జానకీరాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మధురాంతకం రాజాం, పులికంటి కృష్ణారెడ్డి, ఆచార్య పీసీ నరసింహారెడ్డి తదితరులతో సన్నిహితంగా మెలిగారు. తిరుపతిలో జరిగే సాహిత్య సభల్లోనూ, పద్మావతి కాలేజీ సభల్లోనూ ఆమె కనిపించేవారు. తాను చదువుకున్న పద్మావతి కళాశాల అన్నా, ఆ కళాశాలకు రూపం ఇచ్చిన రాజేశ్వరీ మూర్తి అన్నా ప్రేమావతికి ప్రాణం. ఈ ప్రస్తావన లేకుండా ఆమె మాటలు సాగేవి కాదు. రాజేశ్వరీ మూర్తి పుట్టిన రోజులను క్రమం తప్పకుండా జరిపేవారు. ఆమె విద్యారంగానికి చేసిన సేవల గురించి వ్యాసాలు రాసేవారు. 104 ఏళ్ల వయసులో తన గురువు రాజేశ్వరీ మూర్తి అమెరికాలో ఇటీవల కన్నుమూయడంతో ప్రేమావతి బాగా దుఃఖించారు. ఒంటరిగా జీవిస్తూనే కన్నుమూసిన ప్రేమావతి తన ఇంట్లో అద్దెకున్న ఈశ్వరి, ఆమె ఇద్దరు కుమారులనే తన కుటుంబంలా మార్చుకున్నారు. నా కోడలు, నా మనుమలు అని మురిపెంగా చెప్పుకునేవారు. ఆమె ఆఖరి శ్వాస దాకా వారు వెన్నంటే ఉన్నారు.

వాట్ యాన్ ఐడియా సర్ జీ..!

స్కూటీకి టాప్ ఏర్పాటు చేసి ప్రయాణం ● ఎండ నుంచి రక్షణ



తిరుపతి రూరల్, మే9 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలతో జనం అల్లాడి పోతున్నారు. పనిమీద బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. ఎండ నుంచి రకరకాలుగా రక్షణ చర్యలు తీసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే ఓ వ్యక్తి తన స్కూటీపై ఎండ నుంచి రక్షణకు టాప్ ఏర్పాటు చేసుకుని ప్రయాణం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తాటితోపు మీదుగా చెర్లోపల్లెకి వెళ్లే మార్గంలో వెళుతుండగా ఆంధ్రజ్యోతి కెమెరా కంట్లో పడ్డాడు. ఇతడి ప్రయాణం చూసిన వారు వాట్ యాన్ ఐడియా సర్‌జీ అంటూ చమత్కరిస్తున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ



తిరుపతిరూరల్, మే9 (ఆంధ్ర జ్యోతి): దుర్గసముద్రం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న ఫారమ్ పాండ్ (పంటకుంట) పనులను శుక్ర వారం డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ పరిశీలించారు. వేసవి తీవ్రతని దృష్టిలో ఉంచుకుని పనులు జరిగే ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. నీడ, నీరు, ప్రాథమిక వైద్యసేవల కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. ఏపీవో జ్యోతిశ్రీ, ఎఫ్ఏ, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం



చంద్రగిరి, మే 9(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడుకు సొంతూరు పనపాకంలో పంచాయతీ ప్రజలు ఘనంగా సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడుకి డీసీఎంఎస్ చైర్మన్ పదవి రావడంతో శుక్రవారం రాత్రి పనపాకంలో గ్రామస్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజ మాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, మేడసాని కుమార్, మాజీ ఎంపీటీసీ చెంగ్రాయులు, గంగాధరం పాల్గొన్నారు.

వైద్యురాలినంటూ మోసం

● **ఎస్వీఎంసీ హాస్టల్‌లో చోరీకి పాల్పడిన మహిళ అరెస్టు**

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ముసుగులో దొంగతనానికి పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్ మహిళను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుపతి వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. లఖ్‌నవ్‌కు చెందిన కీర్తిసింగ్ కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో డాక్టర్‌గా చెప్పుకొంటూ చెలామణి అవుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న అంజలి హాస్టల్ గదిలోకి వెళ్లి తాను డాక్టర్‌నని పరిచయం చేసుకుంది. ఆమెను మాటల్లో దింపి.. ఖరీదైన పర్సు, అందులోని 6,500 నగదు.. మరో గదిలో విద్యార్థిని పర్సు, అందులోని రూ.5 వేలను అపహరించుకు వెళ్లింది. హాస్టల్‌కు వచ్చిన పీజీ విద్యార్థినులు పర్సులు కనిపించకపోవడంతో వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు.. పీకే లేఅవుట్‌లోని ఓ హోటల్‌లో ఉన్న నిందితురాలిని గుర్తించారు. తనను మానసికంగా వేధిస్తున్నారంటూ ఆమె ఎస్ఐపైనా తిరగబడింది. చివరకు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. హోటల్ గదిలో ఉన్న పర్సు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పీజీ డాక్టర్ అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

తిరుమలేశుడి ఆశీస్సులతో పాక్‌పై సుదర్శన చక్రం



తిరుమల, మే9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి చేతిలోని సుదర్శన చక్రం పేరుతో ఉన్న 'సుదర్శన చక్రం ఎస్ 400'ను పాకిస్థాన్‌పై ప్రయోగించారని, వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే ప్రయత్నం చేశామని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, స్వామి ఆశీర్వాదబలంతోనే 'ఆపరేషన్ సిందూర్' దిగ్విజయంగా నిర్వర్తించారన్నారు. మన సైనికులకు మరింత శక్తిని వ్వాలని, ప్రధాని మోదీకి మనోధైర్యాన్ని ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఇక, రాష్ట్రంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ అనేక రకాలుగా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు.



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బండ్ల గణేష్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, మే9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. వారిలో సినీనిర్మాత బండ్ల గణేష్, మాజీ రాజ్యసభ సభ్యుడు, హిందీ అకాడమి చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉన్నారు.

చినుకుపడితే చెరువే..!



తిరుపతిరూరల్, మే9(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లె పోలీస్‌స్టేషన్ సర్కిల్‌కి సమీపంలో ఆర్సీపురానికి వెళ్లే మార్గంలో చిన్నపాటి వర్షానికి కూడా రోడ్డుపక్కనే ఉన్న గుంతల్లో నీరునిల్వ చేరి చెరువులా మారుతోంది. వర్షం ఆగిన రెండు మూడు రోజులకు కూడా నీరు అలాగే ఉండిపోతోంది. ఈ మార్గంలో వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పాదచారులతోనూ ఈ మార్గం కొంత రద్దీగా ఉంటుంది. ప్రధానంగా పోలీస్ స్టేషన్ సర్కిల్‌కి సమీ పంలోని గుంతల్లో నీరు నిల్వ చేరడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడు తోంది. గుంతలు లేకుండా రహదారిని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చంద్రగిరి

12న కుంభాభిషేకం

భాకరాపేట, మే 9(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు గ్రామం అనుములబండపై కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ గోపుర శిఖర కలశ స్థాపన, కుంభాభిషేకం ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుమ్మడి కృష్ణమూర్తి తెలిపారు. 12న అంకురార్పణ, వేదపారాయణం, గణపతి హోమం, మహా మంగళహారతి, 13న నిత్యదేవత హోమాలు, దేవతా మూర్తులకు మహాస్నపనం, గర్త పూజ, శిఖర కలశ స్థాపన, 14న కళా హోమం, ప్రాణ ప్రతిష్ఠ, కాలన్యాసం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, దేవతామూర్తుల అర్చన, అభిషేకాలు జరుగుతాయని ఆయన తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

భాకరాపేట, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ, బోడిరెడ్డిగారి పల్లె, జంగావాండ్లపల్లె గ్రామాలలో వారు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగరాజు, రమణారెడ్డి, వెంకటలక్ష్మి, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి సత్తార్‌కు ఘన నివాళి



సత్తార్ మృతదేహంపై పార్టీ కండువా కప్పుతున్న దృశ్యం

చంద్రగిరి, మే 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి సత్తార్ మృతి తీరని లోటుని ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ అన్నారు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన సత్తార్ గురువారం రాత్రి మృతి చెందారు. చంద్రగిరి మండ లానికి చెందిన ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, సుజా, శశికళ, అంజి, తిరుపాల్, మురళి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతదేహంపై పార్టీ కండువా కప్పి అంజలి ఘటించారు.

12 నుంచి ఆధార్ నమోదు

తిరుపతిరూరల్, మే9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఈ నెల 12 నుంచి 15వరకు నాలుగురోజుల పాటు ఆధార్ నమోదు, బయోమెట్రిక్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, మే9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: **రూ.2.70 కోట్లు**
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **64,850**
తలనీలాలు సమర్పించినవారు: **28,816**

తిరుమలలో రేపు నృసింహ జయంతి

తిరుమల, మే9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం నృసింహ జయంతి జరగనుంది. ప్రతి ఏటా వైశాఖ మాసం స్వాతి నక్షత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయ మొదటి ప్రాకారంలో గర్భాలయానికి పడమరగా యోగ నరసింహస్వామి ఉప ఆలయం ఉంది. ఈ యోగ నరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం చేస్తారు.

కాలినడకన తిరుమలకు నటి శ్రీముఖి



తిరుమల, మే9 (ఆంధ్రజ్యోతి): సినీ నటి శ్రీముఖి శుక్రవారం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. సాయంత్రం అలిపిరి నుంచి నడకను ప్రారంభించిన ఆమె రాత్రికి తిరుమలకు చేరుకున్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

చింతగుంటలో వాహనాలపై దాడులు

ఎర్రావారిపాళెం, 9 మే (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుంటలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇండ్ల ముందు నిలిపి ఉంచిన మూడు కార్ల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామస్తులు గుర్తించి కేకలు వేయడంతో పరారయ్యారు. బాధితులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గ్రామంలోని సచివాలయ అద్దాలను సైతం ధ్వంసం చేశారు.

వ్యవసాయ పనిముట్లు, దాణా పంపిణీ

● **కొటాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం**
● **అన్ని వసతులతో అద్దెభవనంలోకి పీహెచ్‌సీ**



రైతులకు దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మే 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని రైతులకు సబ్సిడీ ద్వారా మడకలు, ఇతర వ్యవ సాయ పనిముట్లు ఎమ్మెల్యే పులివర్తి నానీ పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొత్తం 15 మంది రైతులకు వీటిని అందించారు. అలాగే పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు, డాక్టర్ వంశీ, ఏవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొటాల గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతగుర్రప్పగారిపల్లి, బందార్లపల్లి, కొటాల మాదిగవాడ గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి బోరు ప్రారంభించారు. అలాగే ఇంతకాలం సచివాలయ భవనంలోని ఓగదిలో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గ్రామంలోని అద్దె భవనంలోకి మార్చి ప్రారంభించారు. అదేవిధంగా ఐతేపల్లి ఎ.రంగంపేట మార్గమధ్యంలో కొటాల పంచాయతీ పరిధిలోని కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలలోని శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, డాక్టర్లు ప్రియాంక, కుసుమ, శిరీష, టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, సురేష్‌రెడ్డి, ప్రవీణ్‌చౌదరి, శేఖర్, రాజేంద్రనాయుడు, బీజేపీ నాయకులు దీనదయాళ్ నాయుడు, సర్పంచ్ గంగులమ్మ, ఎంపీటీసీ మధు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే ఇక చంద్రగిరికి వెళ్లాల్సిందే..!

● **పాకాల నుంచి తరలిపోయిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయం**



పాకాల, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలంలోని విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికి ఇకనుంచి చంద్రగిరికి వెళ్లాల్సిందే. ఎన్నో ఏళ్ల నుంచి పాకాలలో వున్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయం మే నెల ఒకటవ తేదీ చంద్రగిరికి తరలించారు. పెనుమూరు, పూతలపట్టు, ఐరాల, పులిచెర్ల, పాకాల మండలాలకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాకాలలో విద్యుత్ రెవెన్యూ కార్యాలయం వుండేది. ఈ మండలాలలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను ఈ కార్యాలయంలో పరిష్కరించుకునే వారు. తరువాత పెనుమూరు, పూతలపట్టు, ఐరాల మండలాల పరిధి తప్పించారు. పాకాల, పులిచెర్ల మండలాలకు సంబంధించి పాకాల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయం సేవలు అందించేది. పక్కా భవనం ఉంది. అకౌంట్స్ అధికారితో పాటు ఇద్దరు జేఐవోలు వుండేవారు. ఈ కార్యాలయం ఇప్పుడు చంద్రగిరికి తరలించారు. విద్యుత్ బిల్లుల్లో పొరపాట్లు, పేరు మార్పులు వుంటే ఇక్కడ చేసుకునేవాళ్లు. ఇప్పుడు ఏ సమస్య వున్నా చంద్రిగిరికి వెళ్లాలని వినియోగదారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు పనిచేసేది. ఇప్పుడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే పరిమితం చేశారు. అందరికీ అందుబాటులో వున్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని పాకాలలోనే కొనసాగించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువత జాతీయ విజ్ఞాన సంపద



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 9(ఆంధ్రజ్యోతి): దేశం ప్రధాన ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, యువ తను జాతీయ విజ్ఞాన సంపదగా తీర్చిదిద్దడలో ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తుందని పులి వెందుల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రామపురం సమీపంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం బీ-ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేణుగోపాల్‌రెడ్డి, రేణిగుంటకు చెందిన గ్లోరి ఫార్మకెమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ రామచంద్రారెడ్డి, కలికిరి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఏనుగుల దాడిలో మృతిచెందిన కుటుంబానికి రూ.5 లక్షల పంపిణీ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న నాని

చంద్రగిరి, మే 9(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో మృతిచెందిన కందులవారిపల్లె ఉప సర్పంచ్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు రాకేష్ చౌదరి కుటుంబానికి టీడీపీ రూ.5లక్షలు అందజేసింది. జనవరి 18న ఏనుగుల దాడిలో రాకేష్‌చౌదరి మృతిచెందిన విషయం తెలిసిందే. టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకోవడంతో ఆయనకు ప్రమాద బీమా కింద రూ.5 లక్షల చెక్కును మంజూరు చేసింది. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని చెక్కును రాకేష్‌చౌదరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు, నాయకులు వెంకటపతినాయుడు, గుర్రప్పనాయుడు, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, మండీరావు పాల్గొన్నారు.

పాకిస్థాన్ నుంచి బెదిరింపు కాల్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గాజుల వ్యాపారి.. తిరుపతికి చెందిన జనసేన కార్యకర్త త్రిలోక్‌కుమార్‌కు రెండు రోజుల క్రితం పాకిస్థాన్ నుంచి వచ్చిన బెదిరింపు కాల్‌పై కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. త్రిలోక్‌కుమార్‌కు బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పాకిస్థాన్‌కు సంబంధించి +923292527504 నెంబరు నుంచి ఫోను కాల్ వచ్చింది. 'నేను పాకిస్థాన్‌కు చెందిన అధికారిని. నీ పేరు త్రిలోక్‌కుమార్ కదా? నీ కుటుంబ సభ్యుల పేర్లు ఇవే కదా. జాగ్రత్తగా ఉండండి. మీ ఇంటిపైన, ఇంట్లోవాళ్లపైన బాంబులు వేస్తాం' అంటూ బెదిరించాడు. దీనికి త్రిలోక్‌కుమార్ అదే స్థాయిలో హిందీలో దీటుగా సమాధానం చెప్పారు. తమ సైన్యం తగురీతిలో సమాధానం చెబుతోందన్నారు. ఆ తర్వాత ఆయన 100కు కాల్ చేసి తనకు పాకిస్థాన్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు ఫోను సంభాషణ సమాచారం సేకరించారు. త్రిలోక్‌కుమార్ నుంచీ వివరాలు తీసుకున్నారు. దీనిపై విచారించిన అలిపిరి సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

మనసుతో స్వామిని దర్శించాం

● **శ్రీవారి సేవలో పాల్గొన్న మహారాష్ట్ర అంధులు**



తిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): 'ఆ దేవదేవుడిని మనసుతో దర్శించుకున్నాం' అని మహారాష్ట్రలోని అమరావతికి చెందిన 74 మంది అంధులు ఆనందం వ్యక్తంచేశారు. తిరుమల బాలాజీని దర్శనం చేసుకోవాలనే కోరికను వీరు వ్యక్తపరిచిన నేపథ్యంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పూర్తిస్థాయి కంటిచూపులేని 52 మంది.. మోస్తరుగా చూడగలిగే 22 మంది కలిసి వలంటీర్ల సహాయంతో శుక్రవారం తిరుమలకు వచ్చారు. టీటీడీ అధికారుల ప్రత్యేక అనుమతితో సీనియర్ సిటీజన్ క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వారిలో కొందరు మీడియాతో మాట్లాడుతూ.. కంటి చూపు లేకపోయినా, స్వామి సన్నిధిలో నిలబడి మనసులో దర్శించామని సంతోషం వ్యక్తం చేశారు. కొంతమంది అంధులు స్వామిని చూడాలని 20 ఏళ్లుగా వేచిచూస్తున్నారని మహారాష్ట్రలోని తన మిత్రులు చెప్పడంతో వీరికి కల్యాణోత్సవం బ్రేక్ ద్వారా దర్శనం కల్పించామని భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. దేవుడిని ఎలా చూడగలరని తాను వారిని ప్రశ్నిస్తే.. 'స్వామి ఆలయంలో అడుగుపెడితే చాలు. ఆ స్పర్శ మాకు ఆనందాన్నిస్తుంది' అని వారు చెప్పారని గుర్తుచేసుకున్నారు.


సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తిరుచానూరు, మే 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు సంబంధించిన పలువురికి రూ.27.59లక్షలను అందజేశారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తిరుచానూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతి రూరల్‌మండలంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆరు మండలాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని పలుశాఖల అధికారులకు సూచించారు.

సైనిక సంక్షేమానికి రూ.5 లక్షలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల సంక్షేమానికి తిరుపతికి చెందిన జ్యోతికృష్ణ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. తిరుపతిలోని మంగళంలో పీజీ హాస్టల్ నిర్వహిస్తున్న ఆయన.. ఈ విరాళ మొత్తాన్ని తన తండ్రి శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ సత్యేందర్ దయాకు శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే దేశభక్తిని అలవరుచుకోవాలని జ్యోతికృష్ణ కోరారు. ఆయన కుటుంబ సభ్యులు, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి సారె తీసుకొస్తున్న కార్పొరేటర్ ప్రవల్లికారెడ్డి



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నరసింహయాదవ్, మునికృష్ణ, మహేష్‌యాదవ్



దర్శనానంతరం ఆలయంలో బీజేపీ, టీడీపీ నాయకులతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు

జాతరలో తోటోళ్ల సందడి

భక్తులతో కిక్కిరిసిన ఆలయం

తిరుపతి(జీవకోన), మే 9(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని శుక్రవారం తోటి వేషధారణతో భక్తులు సందడి చేశారు. బొగ్గుపొడిన ఒళ్లంతా పూసుకుని, తెల్లనామం దిద్దుకుని, కనుబొమ్మలపై చుక్క బొట్లు పెట్టుకుని, మీసాలను దిద్దుకుని నడుంచుట్టూ వేపాకు మండలను కట్టుకుని తోటి వేషధారణలో అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులైతే బూతులు తిడుతూ సందడి చేశారు. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం కావడంతో గంగమ్మకు అభిషేకం చేశారు. అభిషేక దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఏర్పాట్లను కమిషనర్ మౌర్య పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. 11వ డివిజన్ కార్పొరేటర్ ప్రవళికరెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



అమ్మవారికి సారె తెస్తున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్



టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, మహేష్‌యాదవ్, జలపోతు చంద్ర, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జండర్స్‌ను అడ్డుకున్న పోలీసులు

తుడా సర్కిల్ మీదుగా గంగమ్మ ఆలయంలోకి ప్రవేశిస్తున్న ట్రాన్స్‌జెండర్స్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆలయం వద్దకువెళ్లి భక్తులను ఇబ్బందులకు గురిచేయొద్దంటూ సూచించారు. దీంతో ట్రాన్స్‌జెండర్స్ తుడా సర్కిల్ వద్ద ఆగిపోయారు.

పట్టు వస్త్రాల సమర్పణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మకు ఏకవీర ఫౌండేషన్ స్థాపకులు ప్రతాప్ స్వామీజీ, రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపినాథ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ రకాల వేషధారణలు, కళాకారులతో వారు పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం గంగమ్మను దర్శించుకున్నారు.



సారె సమర్పణ

తిరుపతి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్ అధ్యక్షుడు ఆర్.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించారు. ఏడీ బిల్డింగ్ నుంచి పాదయాత్రగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు, పండ్లు వంటి పూజా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ తలారి మహేష్, డైరెక్టర్ హేమసుధ, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతరలో ప్రత్యేక ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(జీవకోన), మే 9(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన గంగమ్మ ఆలయాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. 12, 13 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, ఆలయ ఈవో జయకుమార్, జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

రూ.3 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం జిల్లా అదనపు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. తమిళనాడుకు చెందిన విజయకుమార్ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ తిరుపతి డివిజన్ నాగపట్ల బీటులో పట్టుబడ్డాడు. ఈ కేసు విచారణ పూర్తి చేసుకోవడంతో గత నెల 22న న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు. అయితే అతను కోర్టుకు హాజరుకాలేదు. నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేశారు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకుని శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఐదేళ్ల జైలు శిక్ష, మూడు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గ్రూప్-1 పరీక్షలకు 607మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలకు 607మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. 911 మంది అభ్యర్థులకు గాను 607 మంది హాజరయ్యారని, 304మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచామన్నారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాతపరీక్షలు నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం వారికి మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 64 సెంటర్లకు గాను 30,182 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం కేంద్రాల వద్దకు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాయుడుపేట, మేనకూరు మండలాల్లోని గ్రామాల్లో భూసేకరణ, రోడ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజరు శివకుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లాకు మొత్తం 1,267 యూనిట్లు మంజూరయ్యాయని, వీటి మొత్తం విలువ రూ.53 కోట్లు ఉంటుందని అన్నారు. 20వ తేదీలోపు ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు ఆయా పథకాలను బట్టి సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్లలో ఈ ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం) మే 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 14 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. 10 రోజులుగా తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టి ఎక్కువ మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని శుక్రవారం తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరచగా రూ.10వేలు వంతున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తుడా టవర్స్‌లో 24 ఫ్లాట్లు, 5 కమర్షియల్ స్పేస్‌కు

ఈ-వేలం పూర్తి

రూ.62.57కోట్లు ఆదాయం

టీడీఆర్ మేళాలో 107 బాండ్లు ఇచ్చాం

కమిషనర్ మౌర్య

తిరుపతి, మే9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌కు కొనుగోలుదారుల నుంచి మంచి డిమాండు ఉందని, ఇప్పటివరకు 24 రెసిడెన్షియల్ ఫ్లాట్లు, 5 వాణిజ్య గదులు ఈ-వేలం ద్వారా విక్రయించామని తుడా వీసీ మౌర్య చెప్పారు. శుక్రవారం తుడా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు రూ.62.57కోట్లకు తుడా టవర్స్ విక్రయించగా ఇందులో తొలివిడతగా 20శాతం తుడా ఖాతాలోకి వచ్చిందన్నారు. మిగిలిన వాణిజ్య గదులకు వేలం ప్రక్రియ కొనసాగుతోందని, ఆసక్తి ఉన్న వారు తుడా కార్యాలయంలో సంప్రదించవచ్చని అన్నారు. ఇక తిరుపతి నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న టీడీఆర్ మేళాలో 557 బాండ్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 107 జారీ చేశామన్నారు. మరో 239 గిఫ్ట్‌డీడ్ ఇచ్చి అప్రూవల్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. 140 ఆస్తులు మాత్రం కోర్టు వివాదాల్లో ఉన్నాయన్నారు. 68 ఆస్తులకు యజమానులు ఎవరో తెలియడంలేదని, టౌన్ ప్లానింగ్ విభాగం వారు వివరాలు సేకరించే పనిలో ఉన్నారని తెలిపారు. టౌన్‌క్లబ్ స్థలం పట్టా అని తేలిందని, దానికి కూడా టీడీఆర్ ఇస్తామని అన్నారు. అందరి సమన్వయంతో జాతరను జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

క్రీడా పరికరాల వితరణ

తిరుపతి రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల అనుబంధ బాలికల వసతి గృహానికికి కెనరా బ్యాంక్ ఆర్థిక సౌజన్యంతో రూ.50వేలు విలువ చేసే క్రీడా పరికరాలు అందజేశారు. డివిజనల్ మేనేజర్ సువర్ణకృష్ణ నేతృత్వంలో టేబుల్ టెన్నిస్, క్యారమ్ బోర్డు, షటిల్ బ్యాట్స్‌ని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కాగా వీసీ, డివిజనల్ మేనేజర్ సరదాగా కొంతసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో సమానంగా క్రీడలు, వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు.

బుగ్గోత్సవం ప్రారంభం

తిరుపతి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం బుగ్గోత్సవం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవంలో తొలిరోజు ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం కల్పించారు. ఆలయంలోని బుగ్గవద్దకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం ఉభయనాంచారులతో కలసి ఊంజల్‌సేవ, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆస్థానం కావించారు.

ప్రేమావతి కృషి చిరస్మరణీయం

పలువురి సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీ విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ డీఎం ప్రేమావతి మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పద్మావతి కాలేజీలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ తదితరులు ప్రేమావతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కళాశాలకు ప్రేమావతి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి, వార్డెన్ హేమలత మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం కల్గిన అధ్యాపకురాలు ప్రేమావతి అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు భువనేశ్వరీదేవి, ఉమారాణి, నిగార్ సుల్తానా, కస్తూరి, మహేశ్వరి, శ్రీలక్ష్మి, సునీత, సాయికుమారి, జయశ్రీ, విద్యుల్లత, శాంతి, నాగపద్మ, వెంకటలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.



ప్రేమావతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సాహిత్య సంస్థల సంతాపం

ప్రేమావతి మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, తెలుగు భాషోద్యమ సమితి మాజీ అధ్యక్షుడు గంగవరం శ్రీదేవి, టెంకాయల దామోదరం, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న తదితరులు సంతాపం తెలిపారు. ప్రేమావతి మరణం తిరుపతి సాహితీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

సైనికులకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు : చింతా

తిరుపతి(వైద్యం), మే 9(ఆంధ్రజ్యోతి): దేశ ప్రతిష్ఠను కాపాడటం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు కాంగ్రెస్ తరఫున పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. టీటీడీ పరిపాలనా భవనం ముందు శుక్రవారం చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెడుతున్న మన సైనికులకు తల వంచి సెల్యూట్ చేయాలన్నారు. టీటీడీ అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఇప్పటివరకు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై దృష్టి సారించాలన్నారు. తిరుమలలో ఎస్సీలకు దుకాణాలు కేటాయించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న చింతా మోహన్

గ్రామీణ జీవన సంస్కృతి ప్రతిబింబమే జానపదం

మన పల్లె జానపదం జాతరలో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవన సంస్కృతికి జానపద కళలు ప్రతిబింబంగా నిలుస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజా కళా వేదిక-స్టూడెంట్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్తంగా 'మన పల్లె జానపదం జాతర' కార్యక్రమాన్ని ఎస్వీయూ సెనెట్ హాల్లో చేపట్టాయి. రెండు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల కళాకారులు జానపద గేయాలాపనతో అలరిస్తున్నారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ పల్లె యాసకు జానపదం జీవం పోస్తుందన్నారు. ప్రజల జీవన విధానం, నమ్మకాలు, సంస్కృతి, విలువలను జానపదం అందిస్తుందన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల కష్టసుఖాలు జానపద కళల్లో కనిపిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ రాజ్య మహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి మాట్లాడుతూ మరుగున పడుతున్న జానపద కళలను కాపాడుకోవాలన్నారు. రచయిత డాక్టర్ వీఆర్ రాసాని మాట్లాడుతూ జానపద కళలు మనుషులను ఒక చోటకు చేరుస్తాయన్నారు. ప్రజా కళా వేదిక ప్రతినిధులు అరవ జయపాల్, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు మాట్లాడారు. నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది కళాకారులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నల్లాని రాజేశ్వరి, భూపతి నాయుడు తదితరులు

కూల్‌డ్రింకు దుకాణంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీ రోడ్డులోని వెంకట ఫ్రెష్ జ్యూస్ కార్నర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం యజమాని దామోదరరెడ్డి రోజులాగే గురువారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి తర్వాత దుండగులు షట్టర్ కింది నుంచి దుకాణంలోకి చొరబడ్డారు. రూ.20వేలు నగదు, కొన్ని చాక్లెట్లు, ఐస్ క్రీంలు తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచిన దామోదర రెడ్డికి షాపులో ఉంచిన నగదు కనిపించకపోవడంతో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

తిరుపతి, 9(ఆంధ్రజ్యోతి) : నగరంలో పెండింగ్ డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, అఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులను కమిషనర్ మౌర్య ఆదేశించారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద, కరకంబాడి మార్గంలోని సీపీఆర్ అపార్ట్మెంట్ వద్ద, రామానుజ కూడలి నుంచి శంకరంబాడి కూడలి వరకు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీల నిర్మాణ పనులను ఆమె స్మార్ట్‌సిటీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులతో కలసి శుక్రవారం పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. గరుడ వారధి డివైడర్ల మధ్యలో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలన్నారు.

మన సైనికులే రియల్ హీరోలు

తిరుపతి(జీవకోన), మే 9(ఆంధ్రజ్యోతి): మన సైనికులే రియల్ హీరోలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదాన్ని అణిచివేయాలన్న సంకల్పంతో ఉన్నారన్నారు. సినీ పరిశ్రమ ఇందుకు మద్దతు తెలపకపోవడం బాధాకరమన్నారు. పెహల్గాం ఘటన తర్వాత ఉగ్రవాదులపై ప్రతీకారచర్య కోసం అందరూ ఎదురు చూస్తుంటే ఇండియన్ సినీ పరిశ్రమకు చెందిన హీరోలు మాత్రం తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా ఉండటం సిగ్గుచేటన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మే 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని తిరుచానూరు సెక్షన్‌లో గల పద్మావతీపురం ఫీడర్‌లో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. హోటల్ గ్రాండ్‌రిడ్జి, కొత్తపాళెం లేఅవుట్, మార్కెట్ యార్డ్, తిరుచానూరు, దామినేడు, కలెక్టర్ కార్యాలయం, పద్మావతీపురం సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కామర్స్ పరిశోధకుడు కె.కలేష్ డాక్టరేట్ పొందారు. పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ లిస్టెడ్ కంపెనీస్ ఆఫ్ ఎన్ఎస్ఈ-ఎమెర్జ్ అంశంపై ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉద్యమించాలని ఏపీటీఎఫ్ 251(ఆంధ్రప్రదేశ్, టీచర్స్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ఉపాధ్యాయ సంఘాలకు పిలుపునిచ్చారు. పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఏపీటీఎఫ్ నేతలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జీవో ద్వారా విద్యారంగాన్ని అతలాకుతలం చేసిందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్ ఉన్న మూడు డీఏలను తక్షణమే ప్రకటించాలన్నారు.ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని డిమాండ్ చేశారు.వెంకటాద్రి, భువనేశ్వరి, లక్ష్మమ్మ, మదన్‌మోహన్, గోపాల్, శ్రీధర్, జయరామయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నేటి నుంచి సమాచార కేంద్రాల ప్రైవేటీకరణ

తిరుపతి(ఆర్టీసీ), మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో శనివారం నుంచి అనౌన్స్‌మెంట్‌ను ప్రైవేటీకరించనున్నారు. శ్రీహరి, శ్రీనివాసం, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్లలో నాలుగు విచారణ కేంద్రాలున్నాయి. షిఫ్టు పద్ధతిలో 14మంది రెగ్యులర్ కండక్టర్లు ఇందులో పనిచేస్తున్నారు. అయితే కాలక్రమంలో పలువురు కండక్టర్లు ఉద్యోగ విరమణ పొందడం, ఆ పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. ఈ సమస్యను వివరిస్తూ అనౌన్స్‌మెంట్ ప్రక్రియను అవుట్ సోర్సింగ్‌కు అప్పగించాలని కోరుతూ గత ఏడాది ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. అనుమతులు రావడంతో శనివారం నుంచి అమలు చేయనున్నారు.

ప్రయాణికురాలి నగలు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికురాలి బ్యాగునుంచి బంగారు చైనును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు చెప్పిన వివరాల మేరకు.. విజయవాడ సమీపంలోని గుణదలకు చెందిన చెన్నాయమ్మ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం కోసం నాలుగు రోజుల క్రితం వచ్చారు. దర్శనానంతరం తిరుమల నుంచి తిరుపతికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. విజయవాడ బస్సు కోసం వేచి చూస్తున్నారు. గుర్తు తెలియనివ్యక్తి చెన్నాయమ్మ వద్దకు వచ్చి ఆమెను మాటల్లోకి దించి, బ్యాగులో ఉన్న బంగారు చైను కొట్టేశాడు. కొంతసేపటికి ఈ విషయాన్ని గమనించి పోలీసు అవుట్ పోస్టులో ఫిర్యాదు చేద్దామని వెళ్లగా అక్కడ ఎవరూ లేరు. ఈ క్రమంలో బస్సు రావడంతో ఎవరితో చెప్పుకోవాలో తెలియక వెళ్లిపోయారు.

బాలిక అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన బాలిక(17) అదృశ్యమైంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. సుభాష్‌నగర్‌కు చెందిన రాధమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె చంద్రశేఖరరెడ్డి కాలనీలోని తాత ఇంట్లో ఉంటోంది. ఐదు రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఎవరితోనో మాట్లాడుతుంటే తమ్ముడు యుగంధర్ బాబు ఆమెను మందలించాడు. మనస్థాపానికి గురైన బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఐదు రోజులుగా బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా కనపడకపోవడంతో శుక్రవారం ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నివాళి

వెళ్లిపోయిన ప్రేమమూర్తి



పద్మావతి కళాశాల తొలితరం అధ్యాపకురాలు ప్రేమావతి మృతితో శోక సంద్రంలో స్నేహాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఒక తరం సాహిత్యవేత్త వెళ్లిపోయారు. పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం విద్యార్థీ, అధ్యాపకురాలు కూడా అయిన డాక్టర్ డీఎం. ప్రేమావతి మరణం ఆమె శిష్యులనూ, సాహిత్యకారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం నంగమంగళంలో 1942లో పుట్టిన ప్రేమావతి ఊరుదాటి చదువుకోవడమే ఆ కాలపు విచిత్రం. వీరికి తాతయ్యే కేఎం.రెడ్డి ఇందుకు కారణం. పై స్కూల్ ఫైనల్ తర్వాత చదువులకు తండ్రి అంగీకరించకపోవడంతో తల్లి నగలు దొంగలించి, ఆ డబ్బులతో రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్‌లో చేరారు. ఆ తర్వాత స్వంత ఊరికి తిరిగి వచ్చి బొమ్మసముద్రంలో పాక వేసి 1948లో బడి తెరిచారు. ఊరూరికీ తిరిగి పిల్లల్ని చేర్పించారు. ముఖ్యంగా ఆడపిల్లల చదువుల మీద ఆయన పెట్టిన శ్రద్ధతో ఆరేళ్ల ప్రేమావతి కూడా 1948లో బొమ్మసముద్రం బడిలో చేరారు. స్కూల్ ఫైనల్ తప్పితే పెళ్లి చేసేస్తామని ఇంట్లో బెదిరించడంతో ఆమె చదువే జీవితంగా గడిపారు. 1952లో తిరుపతిలో ప్రారంభమైన పద్మావతి కళాశాలలో 1958లో పదహారేళ్ల ప్రేమావతి పీయూసీ విద్యార్థిగా చేరారు. ఆ తొలి మెట్టే ఆమె అంతిమ లక్ష్యంగా మారింది. పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీమూర్తికి ప్రియశిష్యురాలిగా మారారు. డిగ్రీ పూర్తి అయ్యాక ఆచార్య జీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో ఎస్వీయూలో పీజీ చేశారు. ఆయన పర్యవేక్షణలోనే దాశరథి రంగాచార్య నవలల మీద పీహెచ్‌డీ చేశారు. రాజేశ్వరీ మూర్తి పట్టుదల వల్ల 1965లో తనకు విద్యాభిక్ష పెట్టిన పద్మావతి కళాశాలలోనే అధ్యాపకురాలిగా చేరారు. వందలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశారు. ఆడవాళ్లకు చదువు అవసరం గురించి పదేపదే చెప్పేవారు. స్వతంత్రంగా జీవించమని అనేవారు. ఆమె శిష్యులు పలువురు వివిధ హోదాల్లో ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉన్నారు.

సాహిత్యవేత్తల సాన్నిహిత్యం : ప్రముఖ సాహిత్యవేత్తలు కెవి రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వకుళభరణం రామకృష్ణ, లలిత, ఆచంట శారదా దేవి, జానకీరాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మధురాంతకం రాజాం, పులికంటి కృష్ణారెడ్డి, ఆచార్య పీసీ నరసింహారెడ్డి తదితరులతో సన్నిహితంగా మెలిగారు. తిరుపతిలో జరిగే సాహిత్య సభల్లోనూ, పద్మావతి కాలేజీ సభల్లోనూ ఆమె కనిపించేవారు. తాను చదువుకున్న పద్మావతి కళాశాల అన్నా, ఆ కళాశాలకు రూపం ఇచ్చిన రాజేశ్వరీ మూర్తి అన్నా ప్రేమావతికి ప్రాణం. ఈ ప్రస్తావన లేకుండా ఆమె మాటలు సాగేవి కాదు. రాజేశ్వరీ మూర్తి పుట్టిన రోజులను క్రమం తప్పకుండా జరిపేవారు. ఆమె విద్యారంగానికి చేసిన సేవల గురించి వ్యాసాలు రాసేవారు. 104 ఏళ్ల వయసులో తన గురువు రాజేశ్వరీ మూర్తి అమెరికాలో ఇటీవల కన్ను మూయడంతో ప్రేమావతి బాగా దుఃఖించారు. ఒంటరిగా జీవిస్తూనే కన్నుమూసిన ప్రేమావతి తన ఇంట్లో అద్దెకున్న ఈశ్వరి, ఆమె ఇద్దరు కుమారులనే తన కుటుంబంలా మార్చుకున్నారు. నా కోడలు, నా మనుమలు అని మురిపెంగా చెప్పుకునేవారు. ఆమె ఆఖరి శ్వాస దాకా వారు వెన్నంటే ఉన్నారు.

ప్రేమకు ప్రతిరూపం

ప్రేమావతి మరణంతో ఆమె స్నేహమాధుర్యాన్ని చవి చూసినవారంతా శోకతప్తులయ్యారు. ఆమె క్రమశిక్షణాయుతమైన జీవనశైలిని గుర్తు చేసుకుంటున్నారు. ఎప్పుడూ నలగని చీర, తలలో మల్లెపూలతోనే ఆమె కనిపించేవారు. 'మనుషుల పట్ల ఆమె ప్రేమాభిమానాలకు కొలతల్లేవు. ఆత్మవిశ్వాసానికీ, ఆత్మాభిమానానికీ ఆమె నిలువెత్తు సాక్ష్యంగా జీవించారు' అని ప్రసిద్ధ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కృష్ణప్రశాంతి గుర్తు చేసుకున్నారు. 'ప్రేమకు ప్రతిరూపం ప్రేమావతి. తన మిత్రులు ఎవరు అనారోగ్యానికి గురైనా తల్లడిల్లిపోయేవారు. ఆమె లోటు స్నేహాభిమానాలు అందుకున్నవారికి ఎన్నటికీ తీరనిది' అని ప్రముఖ చిత్రకారిణి కిరణ్‌కుమారి వ్యాఖ్యానించారు. 'ఆమె ఉత్తమ అధ్యాపకురాలు, భాషా, సాహితీ సేవకురాలు. విద్యారంగానికి మేలుబంతి' అని సాకం నాగరాజ అన్నారు. ' వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రేమావతి మరణం పెద్ద లోటు' అని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్ అన్నారు. గార్లపాటి దామోదర నాయుడు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, రాఘవ, మల్లారపు నాగార్జున, ఓ.వెంకటరమణ, కృష్ణవేణిశైలకుమార్, తీట వెంకటేశ్వర్లు, యువశ్రీ మురళి వంటి ఎందరో సంతాపం తెలిపారు. పద్మావతి కాలేజీలో సంతాప సభ నిర్వహించారు. పద్మావతి కాలేజీకి ప్రేమావతి అందించిన సేవలను పద్మావతి జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు భువనేశ్వరీదేవి, నారాయణమ్మ కొనియాడారు.

పాక్ కవ్వింపు చర్యలకు దీటుగా బదులిస్తున్నాం

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

తడ, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు, దాడులకు దీటుగా బదులిస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూదన్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు నెల్లూరు జిల్లా కావలి వెళుతున్న కేంద్ర మంత్రికి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడి ప్రసన్న ఆంజనేయస్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పహల్గాం దాడికి పాల్పడ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పేందుకు 'ఆపరేషన్ సింధూర్' చేపట్టామన్నారు. దీన్ని భరించలేని పాక్ కవ్వింపు చర్యలకు దిగుతూ సరిహద్దుల్లో దాడులకు పాల్పడుతోందన్నారు. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు దేశం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయా కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఆదినారా యణరెడ్డి, కిషన్‌రెడ్డి, కృష్ణమూర్తి, కోటి ఆచారి, మునికృష్ణయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

చిల్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి పూజలు జరిపారు. తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. చేవూరు శేషయ్య, పవిత్ర, సర్వేపల్లి బాలసుబ్రహ్మణ్యం, జయంతి, ఉడతా శ్రీనివాసులు, సుభాషిణి, నెల్లూరు అచ్చెయ్య, మంగమ్మ, ఉడతా వెంకటేశ్వర్లు విజయమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం జరిపాక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన హోమగుండంలో హోమం నిర్వహించారు. మధ్నాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్, చిట్టేటి విజయకుమార్, బట్టా సుబ్రహ్మ ణ్యం, చెంగయ్య, నూలేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కరిమాణిక్యస్వామి ఉత్సవాలు

నాయుడుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని టీటీడీ ఇన్‌స్పెక్టర్ హరి తెలిపారు. 10వ తేదీ శనివారం అంకురార్పణ, 11న ధ్వజారోహణం, 12న హనుమంతవాహన సేవ, 13న ద్వార దర్శనం, 14న హంస వాహనం, 15న చంద్రప్రభ వాహనం, 16న కల్యాణోత్సవం, 17న రథోత్సవం, 18న పార్వేట ఉత్సవం, 19న ధ్వజావరోహణం, 20న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

మాతమ్మకు విశేష పూజలు



తపస్సుమానుకు పూజలు చేస్తున్న భక్తులు

చిల్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. ఆలయం వద్ద పరుశురాముడి ముగ్గు, జమదగ్ని తపస్సు, వణం కొరుకుట, కార్తీక యుద్ధ సన్నివేశాలను నిర్వహించారు. సాయంత్రం తపస్సుమానుకు పూజలు నిర్వహించారు. అనంతరం మాతమ్మను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

నేదురుమల్లి జనార్దన రెడ్డికి నివాళి

వాకాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న జనార్దనరెడ్డి విగ్రహానికి ఆయన తన యుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు మేరిగ మురళీధర్, విక్రమ్‌రెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మన్నెముత్తేరి, మంగానెల్లూరు, దేగవారికండ్రిగ, అట్టకానితిప్ప సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్నాహ్నం 1:30 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పూర్ణిమ తెలిపారు. అదేవిధంగా సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట, షార్ జంక్షన్, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, చెంగాళమ్మ ఆలయ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, జీఎన్‌టీ రోడ్డు, బాపూజీ వీధి, కచ్చేరివీధి, వనంతోపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ మోహిని తెలిపారు.

తడ: మండలంలో సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండని ఏఈ మురళి తెలిపారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పెళ్లకూరు, ఓజిలి, మే 9(ఆంధ్రజ్యోతి): కొత్త రేషను కార్డుల కోసం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. కొత్త కార్డులతో పాటు సభ్యుల చేరిక, తొలగింపు, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ సరిదిద్దడం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



నెర్రికాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు - సూళ్లూరుపేట పట్టణం వినాయకుడి గుడి సమీపంలో కాలువలో వ్యర్థాలు

అటకెక్కిన నెర్రికాలువ ఆధునికీకరణ పనులు

సాగునీరందక అన్నదాతల ఆందోళన

సూళ్లూరుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల రైతులకు వరప్రసాదిన అయిన నెర్రికాలువ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. దీంతో పొలాలకు సాగురందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు మండలాల పరిధిలో 17.5 కిలో మీటర్లు విస్తరించి ఉన్న నెర్రికాలువ ద్వారా 18 చెరువుల కింద 19వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. అలాగే సూళ్లూరుపేట పట్టణ దాహార్తి తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నెర్రికాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నింపి తాగునీరందిస్తున్నారు. అంతటి ప్రాధాన్యం కలిగిన నెర్రికాలువను దొరవారిసత్రం మండలం తనియాలి వద్దనున్న ఆనకట్ట నుంచి వాటంబేడు వెళ్లే మార్గంలో ఉన్న సూళ్లూరుచెరువు వరకు దాదాపు 11 కిలో మీటర్ల మేర ఆక్రమణలు తొలగించి కాలువకు ఇరువైపులా సిమెంట్ లైనింగ్ పనులు చేసి ఆధునికీకరించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.27.19 కోట్లు కేటాయించింది. అప్పటి ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. తమది రైతు ప్రభుత్వమని, మూడు నెలల్లో నెర్రికాలువ గుండా పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లింపులో జాప్యం చేయడంతో కనీసం 20 శాతం కూడా పూర్తి చేయలేదు. దొరవారిసత్రం మండలంలో రెండు కిలో మీటర్లు, సూళ్లూరుపేట మండలంలో అర్ధ కిలోమీటరు మేర పనులు చేసి ఆపేశారు. ఈ విషయాన్ని రైతులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదు. బాగున్న కాలువను ఆధునికీకరణ పేరుతో తవ్వేయడంతో వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నెర్రికాలువ ఆధునికీకరణ పనులు పునఃప్రారంభించి సాగునీరు అందిస్తుందని కొండంత ఆశతో ఎదురుచూశారు. అయితే 20శాతం లోపు జరిగిన పనులను నిలిపివేయాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో రైతుల ఆశలన్నీ అడియాశలు అయ్యాయి. సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నెర్రికాలువ పనులను చేయాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు నియోజకవర్గంలో బోర్లు, మోటార్లు మరమ్మతులకు గురై ఉంటే వాటిని త్వరతగతిన బాగు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

13 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

వెంకటగిరి టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించడం కోసం ఈనెల 13 నుంచి టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభిస్తారని ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. మొదటి విడతలో మండలంలోని 120 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి నిధులు మంజూరు

కోట, మే 9(ఆంధ్రజ్యోతి): కోటలోని వసతిగృహాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు బీసీ వసతిగృహాల డీఈ రమేష్, ఏఈ మున్నార్ తెలిపారు. కోట, చిట్టేడులోని బీసీ వసతి గృహాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. కోటలోని బీసీ వసతి గృహానికి రూ.17.5 లక్షలు, చిట్టేడు వసతి గృహానికి రూ.15లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులను చేపడుతామని చెప్పారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మల్లికార్జున దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, సుబ్బారావు, ఇబ్రహీం, రజినీకాంత్, సుమన్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

వాకాడు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో విద్యా ర్థులకు బాల్య వివాహాలకు నిర్మూలనపై అంగన్‌వాడీ సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని అన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల బాలికల రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడంతో పాటు వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుంద న్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చిన్నమ్మ, ఏఎన్ఎం నాగమణి, మహిళా పోలీసు అమరావతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పెళ్లకూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): సినీ కథానాయిక సాయిపల్లవి పుట్టినరోజు సందర్భంగా ఆమె అభిమానులు శుక్రవారం నాయుడుపేటలోని చేయూత చిన్న పిల్లల ఆశ్రమం, మేరీ వృద్ధాశ్రామంలో అన్నదానం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రకాశ్, దిలీప్, వెంకీ, ప్రసాద్, గిరి, వంశీకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించండి



రైల్వే జీఎం ఆర్ఎన్ సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. శుక్రవారం ఆమె చెన్నై సదరన్ రైల్వే డివిజన్ జీఎం ఆర్ఎన్ సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయుడుపేట సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాఘవన్, పేర్నాటి జోషఫ్, కంకిపాటి కిరణ్‌కుమార్, నాగ్రేంద్ర, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి పూజలు

గూడూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌రోడ్డులో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం విశిష్టపూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రాహుకాల పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సృజన 2కే 25 జాతీయ సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు 150 పేపర్ ప్రజెంటేషన్లు సమర్పించారు. ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు వెళ్తే హేళన చేస్తున్నారు

సర్పంచు, కార్యదర్శి ఎదుట కార్మికుల ఆవేదన



సర్పంచు, కార్యదర్శి ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కోట, మే 9(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ కోసం ఇంటింటికీ వెళుతుంటే హేళనగా మాట్లాడుతున్నారని, ఆత్మగౌరవం చంపుకుని పారిశుధ్య పనులు చేయలేమంటూ సర్పంచు వెంకటరమణమ్మ, కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు నల్లపురెడ్డి వినోద్‌రెడ్డి ఎదుట పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచు, కార్యదర్శులను కలిసి చెత్త సేకరణ సందర్భంగా వారికి ఎదురవుతున్న అవమానాలను వివరించారు. అంటురోగాలను లెక్కచేయకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేస్తూ మురుగు, వ్యర్థాలను బయటకు తోడేస్తుంటే ఆదరించాల్సిన గ్రామస్తులు అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైే ఆత్మగౌరవం చంపుకుని పని చేయలేమని చెప్పారు. సర్పంచు వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎంపీపీ వినోద్‌రెడ్డి మాట్లాడుతూ వార్డుల వారీగా నివాస గృహాల యజమానులతో చర్చించి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూస్తామని భరోసా ఇవ్వడంతో కార్మికులంతా విధుల్లోకి వెళ్లారు.

భారత సైన్యానికి న్యాయవాదుల సంఘీభావం



భారత ఆర్మీకి సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం చేపట్టిన సాహసోపేత పోరుకు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచుకిష్టయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు భారత ఆర్మీకి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దశయ్య, గంగాప్రసాద్, కిషోర్, పసల చెంగయ్య, శ్రీనివాసులు, రమణయ్య, సురేష్, నారాయణ, లిఖిత చౌదరి, మాధవి, నిత్య, పరశురామయ్య, మోహనకృష్ణ, చిరంజీవి, వంశీ, రఫీ, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం

కోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెంలో గ్రామదేవత గంగమ్మ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలు పూర్తయ్యే వరకు దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులు పొలిమేరల్లో వేపమండిలతో తోరణాలు కట్టి దిష్టి తీర్పులు చేశారు. అనంతరం మేళతాళాలతో సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ అమ్మవారికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



పొలిమేరల్లో దిష్టితీర్పు చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం చెరువు ఆక్రమణ?

రేణిగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం చెరువు ఆక్రమణలకు గురి అయ్యింది. దీనిపై గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో సర్వేయర్లు సర్వే చేసి ఆక్రమణకు గురైందని నిర్ధారించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకటాపురం చెరువు గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆక్రమణకు గురైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానికులు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా గత శనివారం ఇరిగేషన్ అధికారుల సమక్షంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మునక భూమికి పట్టాలు పొంది ఉన్నారు. చెరువులో నీరు లేనప్పుడు వ్యవసాయం చేయాల్సింది పోయి మట్టి తోలి సుమారు 20 ఎకరాలు ఆక్రమించారు. అయితే ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు పొక్కకుండా దాస్తున్నట్టు విమర్శలున్నాయి. దీనిపై రేణిగుంట ఇరిగేషన్ అధికారి హరికృష్ణను వివరణ కోరగా... కొండనుంచి వచ్చే వాన పారే కాల్వ 150 మీటర్లు పూడుకు పోయిందని, సోమవారం లోపు పూడిక తీస్తామన్నారు. ఆక్రమణ గురించి అడిగితే పట్టా భూమి అని తెలపడం గమనార్హం.

వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ ప్రారంభం


లైబ్రరీ ప్రారంభిస్తున్న అరుణాచలం, నిరీషా సన్నారెడ్డి

సత్యవేడు, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో మండలంలోని వడ్డిపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ, రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఐఎఫ్ఎఫ్ ఆపరేషన్ హెడ్ శరవణన్ అరుణాచలం, శ్రీసిటీ సీఎస్సార్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా దీన్ని ప్రారంభించారు. పిల్లలకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలతో పాటు, యువతీ యువకులను చేతివృత్తులలో శిక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కమ్యూనిటీ లైబ్రరీ, రీసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశం. ఇందులో లైబ్రరి, కంప్యూటర్ రూమ్, ట్రైనింగ్ హాల్ ఉంటాయి. పిల్లలు, మహిళలకు ప్రత్యేక విభాగాలు కూడా ఉన్నాయి. ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ మేనేజర్ శరవణన్ బాలసుబ్రమణ్యం, ఫ్రాగ్నాన్సెస్ హెడ్ రాజశేఖర్ మణి, హెచ్ఆర్ హెడ్ అరుణ్‌కుమార్, సీఎస్సార్ హెడ్ కార్తీక్ పళణి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, వడ్డిపాళెం గ్రామస్తులు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరాలయానికి శ్రీసిటీ వితరణ



ఆలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీ, సీసీ కెమెరా

సత్యవేడు, మే 9 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరాలయానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి రూ.2.40 లక్షలతో రెండు సీసీ కెమెరాలు, రెండు 50 అంగుళాల ఎల్ఈడీ టీవీలను వితరణ చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఆలయంలో జరిగే ప్రదోష పూజలు, దక్షిణామూర్తి స్వామివారికి నిర్వహించే అభిషేక పూజలను వీక్షించలేక అసంతృప్తికి గురవుతున్నారు. ఆలయ అధికారుల అభ్యర్థన మేరకు శ్రీసిటీ ఎండీ తన సొంత నిధులతో వాటిని ఏర్పాటు చేయించారు.

పుత్తూరు వార్తలు

వాహనాలను జల్లెడ పడుతున్న పోలీసులు



పుత్తూరు అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కేంద్రంగా గతంలో ఉగ్రవాదులు ఆశ్రయం పొందిన నేపథ్యంలో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం సీఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో వాహనాలను జల్లెడ పట్టారు. తమిళనాడు నుంచి వచ్చే వాహనాలు, వెళ్లే వాహనాలను పుత్తూరు - నారాయణవనం జంక్షన్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌కు చెందిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించిన విషయం విదితమే. రైల్వే కాంట్రాక్ట్ పనులు చేసుకునే వారని నిర్ధారించి వదిలేశారు. గతంలో ఉగ్రవాదులు పుత్తూరులో ఆశ్రయం పొందడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. రాత్రి గస్తీ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఓబయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, మే 9(ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్ల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శుక్రవారం మండలంలోని బట్టీకండ్రిగలో రూ.5లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కానరా లేదని, టీడీపీ ప్రభుత్వం చేయూతతో దశలవారీగా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నూతనంగా ఏర్పడే గ్రామకమిటీ నాయకత్వం గ్రామాలో సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జానా.వెంకటయ్య, నాయకులు వెంకటేష్, పొన్నయ్ రాజు, ప్రభాకర్, శివశంకర్‌రాజు, అజిత్ కుమార్, రమేష్, మోహన్, చంద్రశేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల అందజేత

మండలంలోని టీసీ అగ్రహారంలో ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. వెంకటేష్‌కు రూ.61,811, విజయకు రూ.64,415, మురగారెడ్డికి రూ.20,000 చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు రవిరెడ్డి, దాము తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై సదాశివుడి చిద్విలాసం



పుత్తూరు టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్లు అధికార నందివాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు భిక్షాటన ఉత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 7.30 గంటలకు స్వామిఅమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి అధికార నంది వాహనంపై పట్టణంలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి నటరాజస్వామి అభిషేకం నిర్వహించారు.

గురుకుల ఆంగ్ల బోధనోపాధ్యాయులకు శిక్షణ తరగతులు

పుత్తూరు, మే 9(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఆంగ్ల బోధనోపాధ్యాయులకు తిరుపతిలో మూడురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ తరగతులను అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు, కొటక్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జోన్ 4 లోని ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలోని గురుకుల ఆంగ్ల ఉపాధ్యాయులు దాదాపు 70 మంది పాల్గొన్నారు. ఆంగ్ల బోధనలోని మెలకువలను నేర్పిస్తారని శిక్షణ తరగతుల సమన్వయకర్త గీత, ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

జానపద జాతర పాటల పోటీల విజేత మునికృష్ణయ్య



పుత్తూరు,మే9(ఆంధ్రజ్యోతి): జానపద జాతర పాటల పోటీల్లో పుత్తూరుకు చెందిన చల్లా మునికృష్ణయ్య విజేతగా నిలిచారు.ప్రజా కళావేదిక, ఎస్వీయూనివర్సిటీ సాంస్కృతిక విభాగాలు సంయుక్తంగా శుక్రవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో పోటీలను నిర్వహించాయి. పోటీల్లో మునికృష్ణయ్య విజేతకగా నిలిచారు. ప్రజా కళా వేదిక అధ్యక్షుడు గోపాల్, వర్సిటీ వైస్ ఛాన్సలర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడునుంచి మునికృష్ణయ్య ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పిచ్చాటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం సందర్భంగా సబ్‌స్టేషన్ మరమ్మతులు నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేఖ

పిచ్చాటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాలులో శుక్రవారం ఎంపీపీ రేఖ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించకనే ముగిసింది. ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై తినుబండారాలు తిని మమ అంటూ వెళ్లిపోయారు. ఎంపీటీసీ సభ్యులం దరూ ప్రతిపక్ష సానుభూతిపరులే అయినప్పటికీ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సి ఉండగా తమకేమీ పట్టనట్టు వ్యవహరించారు. కొందరు ప్రజాప్రతినిదులు గుడ్డిలో మెల్లగా అర్థాంతరంగా ఆగిన నాడునేడు పనులు పునరుద్ధరించాలని, హనుమంతాపురంలో కరెంటు షిఫ్టులు వేళలు మార్చడం వల్ల ఉదయం పూట తాగునీటికి అల్లాడుతున్నారని, పాఠశాలల విలీనంతో డ్రాపవుట్లు పెరిగే అవకాశం ఉందంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇరిగేషన్ ఏఈ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ కీళపూడి గ్రామంలో మురుగు నీటి కాలువ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ, ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఏవో శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు గురు సంక్రమణ పరిహార హోమం

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరువీధిలో ఉన్న పుష్పగిరి మఠంలో ఆదివారం గురు సంక్రమణ పరిహార హోమం నిర్వహిస్తున్నట్లు శ్రీశివశక్తి సేవ చారిటబుల్ ట్రస్టు తెలిపింది. గ్రహాల్లో పంచమ గ్రహమైన బృహస్పతి వృషభరాశి నుంచి మిథునరాశిలోకి ప్రవేశించనున్న సందర్భంగా ఈ శాంతి హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శేషవాహనంపై చెన్నకేశవుడి చిద్విలాసం



శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి సోమవారం శేషవాహనంపై గ్రామంలో ఊరేగారు. చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామిఅమ్మవార్లు శేషవాహనంపై ఊరేగారు.

వేడుకగా ఊంజలసేవ



నారాయణవనం, మే 9(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొనారు.

కావమ్మ జాతర

రేణిగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిమిట్టలో కొలువై ఉన్న కావమ్మ ఆలయ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి వేకువజామున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే జాతరలో మొదటి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కావమ్మను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం జరిగింది.

నేత్రపర్వంగా ప్రదోష నంది సేవ

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రాల నడుమ నంది వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉందాం


నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): భారతదేశ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్న పాకిస్థాన్ కుట్రలను తిప్పికొడుతున్న కేంద్రప్రభుత్వానికి అండగా ఉంటామని టీడీపీ నాయకులు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని జయరామరావువీధిలో కేంద్రప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న భారత్‌ను చూసి ఓర్వలేక పాకిస్థాన్ కుట్రపూరితమైన వైఖరితో తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, ముష్కర మూకలను దేశంలోకి పంపించి అస్థిర పరచాలని చూస్తోందన్నారు. దీన్ని భగ్నం చేయడానికి కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రతి చర్యకు యావత్ దేశం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పాకిస్థాన్ సేనలను అడ్డుకునే ప్రయత్నంలో సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ వీరమరణం పట్ల వారు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశరథాచారి, గురవారెడ్డి, మిన్నల రవి, గాలి మురళీనాయుడు, మునిరాజా నాయుడు, నివేదిత మోరె, దుర్గాప్రసాద్, ఉమేష్‌రావు, బాలాజీరెడ్డి, కాసరం రమేష్, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

పిచ్చాటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ఈ మేరకు మాట్లాడుతూ... పిచ్చాటూరు అరణియార్ వద్ద నిర్మిస్తున్న టూరిజం పనులు పూర్తి చేయడానికి తుడా నిధులను అదనంగా రూ.40 లక్షలు కేటాయించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తుడా వైస్‌ఛైర్మన్ మౌర్యరెడ్డికి ఫోన్ చేసి నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు. అలాగే సత్యవేడు మండలంలోని వానెల్లూరులో ఉన్న ఎంబజీ భూములను తుడా నిధులతో అభివృద్ధి చేసి తక్కువ ధరకు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి భూములను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జేసీ శుభంబన్సల్‌కు సూచించారు. నారాయణవనం మండలంలో ఎకో పార్క్ ఏర్పాటుకు, సురుటుపల్లితో పాటు నియోజకవర్గంలో అత్యవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణాల జాబితాను కలెక్టర్‌కు అందించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

● వదిలేసిన సూట్ కేసు ప్రయాణికుడికి అందజేత



రేణిగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆటోలో వదిలేసిన సూట్ కేసును పోలీసుల ద్వారా ప్రయాణికుడికి ఆటో డ్రైవర్ అందజేశారు. రేణిగుంట స్టేషన్ రైటర్ గిరినాయుడు తెలిపిన వివరాలు... శుక్రవారం రేణిగుంట బస్టాండ్ నుంచి బిహార్ రాష్ట్రానికి చెందిన నిఖిల్ కుమార్ ఆటో ఎక్కి తిరుచానూరుకి వెళ్లాడు. అక్కడి దిగే క్రమంలో సూట్‌కేసును వదిలి వెళ్లిపోయాడు. గుర్తించిన ఆటో డ్రైవర్ విజయ్‌కుమార్ దాన్ని రేణిగుంట అర్బన్ పోలీసులకు అందజేశారు. సూట్‌కేస్‌లో వివరాల ఆధారంగా బిహార్‌వాసిని పిలిపించి సూట్‌కేసును అందజేశారు.

భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలి

సివిల్స్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం



నారాయణవనం, మే 9(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పాముర సురేష్ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఆకాంక్షించారు. సివిల్స్ ర్యాంకు సాధించిన సురేష్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. మండల ంలోని అరణ్యం కండ్రిగ పంచాయతీ గోవిందప్పనాయుడు కండ్రిగ కు సురేష్ సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన విషయం విదితమే. శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం గోవిందప్పనాయుడు కండ్రిగకు చేరుకుని పడవేటమ్మ ఆలయంలో సురేష్‌ను, వారి కుటుంబ సభ్యులను శాలువ కప్పి సన్మానించారు. శ్రీనివాసులు యాదవ్, జయచంద్రనాయుడు, కందస్వామినాయుడు, రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రావణేశ్వర వాహనంపై అగస్త్యేశ్వరస్వామి విహారం



నారాయణవనం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లు రావణా సురుడిని వాహనంగా చేసుకుని గ్రామంలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం శివగామి సమేతుడై నటరాజస్వామిని తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం విశేష పూజలనంతరం స్వామిఅమ్మవార్లకు రావణేశ్వర వాహన సేవ నిర్వహించారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం



శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం శుక్రవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంనుంచి స్వామిఅమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామిఅమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.

నేడు శని త్రయోదశి

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 10న శని త్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వర స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. భక్తులు రూ.300 చెల్లించి ఈ అభిషేక పూజల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

15నుంచి ఏఐవైఎఫ్ సభలు

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం ఏఐవైఎఫ్ 17వ జాతీయ సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య మాట్లాడుతూ... ఈనెల 15నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే సభలకు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిచందు, ప్రజా నాట్య మండలి నాయకురాలు చారులత, మరళి, జనార్దన్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాజమండ్రి ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

● జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

దాణా పంపిణీ

పిచ్చాటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న పాడి రైతులకు చంద్రన్న ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో పాడి రైతులకు 50 శాతం రాయితీతో దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతుల సంక్షేమం కోసం గోకులం షెడ్లు, పశువుల తాగు నీటి తొట్టెలు, దాణా, బీమా సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, డిల్లీబాబు, ఎంపీడీవో మహ్మద్ రఫి, పశు సంవర్ధకశాఖ ఏడీ ప్రసాద్, వెలుగు సీసీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తల్లికి వందనం

శ్రీకాళహస్తి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువవీధి, దిగువవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవో శాంతిదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. అందులోభాగంగా ప్రీస్కూల్ చిన్నారులతో వారి తల్లులకు పాదపూజ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఫోన్‌కు దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించారు.

చెరువు కాలువ ఆక్రమణ పరిశీలన

రేణిగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): చెరువు కాలువ బండి బాట స్థల ఆక్రమణను తహసీల్దార్ పరిశీలించారు. తన పొలానికి దారిలేక మూడేళ్లుగా వరి సాగు చేయలేకపోతున్నానని అత్తూరు గ్రామానికి చెందిన రైతు ఈశ్వర్‌రెడ్డి ఆవేదనపై 'చెరువు కాలువ స్థలం ఆక్రమణ' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు కాలువ స్థలం ఆక్రమించుకున్న రైతులను పిలిపించి చర్చించారు. బండిబాటకు 12 అడుగుల దారిని కేటాయిస్తామని తహసీల్దార్ చెప్పారు. దీంతో రైతులు సమ్మతించారు.